క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్ ఫిల్టర్ అందజేసి, ప్రారంభిస్తున్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ స్వర్గీయ సత్యగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు గురువారం మీనరల్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. రూ.25 వేల విలువల వాటర్ ఫిల్టర్ హెచ్ఎం నాగభూషణంకు అందజేశారు. విద్యార్థులకు మంచి నీటిని అందించేందుకు వాటర్‌ఫిల్టర్ ఇచ్చిన శోభన్‌గౌడ్, జగన్ గౌడ్, మోహన్‌గౌడ్‌లకు హెచ్ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన నవీన్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారాజు బాబురావు గురువారం పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. పేద మాల కుటుంబాలకు చెందిన వారిని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఉప సర్పంచ్ నవీన్ తదితరులు ఉన్నారు.

సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న హెచ్ఎం, సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మౌనిక అనే విద్యార్థిని ఇటీవల సీఏ పాస్ అయింది. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినిని హెచ్ఎం మోహన్‌రావు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాబు, నాయకులు నర్సింహరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామగ్రి అందజేత



మనోహరాబాద్(తూప్రాన్): పర్కిబండ పాఠశాలలో బోర్డులను అందిస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం పలువురు దాతలు సామగ్రిని గురువారం అందజేశారు. మండలంలోని పర్కిబండ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోర్డులు, సీలింగ్ ఫ్యాన్, స్టేషనరీ వస్తువులను గ్రామానికి చెందిన ఠాకూర్ లక్ష్మణ్‌సింగ్ తన సొంత నిధులతో అందజేశారు. కాళ్లకల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆటవస్తువుల కోసం గ్రామ యువకుడు నేతికుంట విద్యాసాగర్ రూ. 4 వేలు నగదును పాఠశాలకు అందజేశారు. పలు గ్రామాల్లో దాతలు పాఠశాలకు వస్తువులను
అందజేశారు.

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపసర్పంచ్ స్రవంతి రాజేందర్ టై, బెల్టులు అందజేశారు. నిరుపేద విద్యార్థుల శ్రేయస్సుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని వడియారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ ఫ్యాన్‌లను బహూకరించారు. పాఠశాల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల విద్యార్థుల కోసం తనవంతుగా ఫ్యాన్‌లు అందిస్తున్నట్లు దాత గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాబాయి, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టేక్మాల్ ఎస్ఐకి ప్రశంస పత్రం



ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న ఎస్ఐ లింగం

టేక్మాల్(మెదక్): గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ టేక్మాల్ ఎస్ఐ లింగంకు ఉత్తమ ఎస్ఐగా ప్రశంసపత్రాన్ని అందజేశారు. దీంతో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు అభినందించారు.

మురిసిన మువ్వన్నెల జెండా

జిల్లా వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వాడవాడలా జాతీయ జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, వివిధ కుల సంఘాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రముఖుల వేషధారణతో అందరినీ ఆకర్షించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఎగురవేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



పెద్దశంకరంపేట(మెదక్): వేడుకల్లో ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే కార్యాలయంలో..



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో ..



శివ్వంపేట(నర్సాపూర్): తహసీల్దార్ కార్యాలయంలో..



మెదక్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయులు, విద్యార్థులు



మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో..



తూప్రాన్: ఆర్డీఓ కార్యాలయంలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): రెవెన్యూ కార్యాలయం



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



మెదక్ రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో..



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో..



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో..



నర్సాపూర్: పట్టణంలో చిన్నారులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతాపూర్‌లో..



అల్లాదుర్గం(మెదక్): ఎంపీపీ కార్యాలయం వద్ద ..



రేగోడ్(మెదక్): మోడల్ స్కూల్‌లో..



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో...

రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



సహకార సంఘం మీటింగ్‌హాల్ ప్రారంభిస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మడూర్ గ్రామంలో రైతు సహకార సంఘం సమావేశ మందిరం ప్రారంభించడంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సహకార సంఘం ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించడం ద్వారా రైతు సహకార సంఘాలు బలోపేతం అవుతున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నర్సమ్మ, ఎంపీటీసీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాధవిరాజు, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పట్లోరి రాజు, బండారు స్వామి, సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతో స్వేచ్ఛాయుత జీవనం



బహుమతులు అందిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే భారతదేశంలో స్వేచ్ఛాయుత జీవనం సాధ్యమైందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎంపీటీసీ భాగ్యమ్మనాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై.. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, హెచ్ఎం ఆంజనేయులు, విద్యాకమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **యువకుడి సైకిల్ యాత్ర**

మనోహరాబాద్(తూప్రాన్): రైతుల అభివృద్ధి కోసం అనంతపూర్ నుంచి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేపట్టిన యువకుడు ప్రదీప్‌కుమార్‌ను మండల యువకులు గురువారం స్వాగతం పలికారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

నర్సాపూర్: నర్సాపూర్‌లోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, కాలేజీలో వచ్చే విద్యా సంవత్సరానికి చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ తెలిపారు. 2023 - 2024 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో ఐదవ తరగతిలో, కాలేజీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30 వరకు గడువు ఉందని ఆయన చెప్పారు. పూర్తి వివరాల కోసం 73311 70835 నంబరులో సంప్రదించాలని సంగమేశ్వర్ కోరారు.

◆ **మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుజాత**



రామాయంపేట(మెదక్): రామాయంపేట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తొనిగండ్ల గ్రామ ఉపసర్పంచ్ కోటిగారి సుజాతను ఎంపిక చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బండారి రాజేశ్వరి సన్మానించారు. సుజాత ఎంపికపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్యాంరెడ్డి, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు చింతల యాదగిరి, మున్సిపల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్, ఇతర నాయకులు బాబు, ఎల్లగారి రాజు హర్షం వ్యక్తం చేశారు.

◆ **కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి**

చిన్నశంకరంపేట(మెదక్): భార్యతో ఉన్న గొడవలతో మానసిక వేదనతో చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడ్డ మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ అంత్యక్రియలు తల్లి నర్సమ్మ అన్ని తానై నిర్వహించారు. మండలంలోని టీ.మాందాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సత్యనారాయణ బుధవారం చెరువులో పడి బలవన్మరణం చెందాడు. గురువారం జరిగిన అంత్యక్రియల్లో భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నా.. అంత్యక్రియలకు హాజరుకాకపోవడంతో వృద్ధురాలైన తల్లి నర్సమ్మ అంత్యక్రియలు పూర్తిచేసింది.

◆ **విద్యార్థులకు బహుమతుల పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట ప్రాథమిక పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ప్రతీ తరగతిలో ప్రథమ, ద్వితీయ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గుర్తించి, ప్రోత్సాహ బహుమతులు అందిస్తున్నట్లు ఎల్ఐసీ మెనేజర్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌బాబు, జావిత్, తాటికొండ స్వామి, నాయిని ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ఒడి బియ్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

'పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి'



ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): రిపబ్లిక్ డే రోజున కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న మాసాయిపేట మండలంలోని శ్రీ వైష్ణవి పైప్స్ ఇండస్ట్రీస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరిశ్రమ నిర్వాహకులు కార్మికులతో బలవంతంగా పనులు చేయించడాన్ని తెలుసుకున్న నాయకులు కార్మికులతో కలిసి పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన పరిశ్రమ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చాకరిమెట్లలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ బాలాలయంలో పూజలుచేస్తున్న అర్చకుడు



మెదక్ రూరల్: పేరూర్ సరస్వతీ ఆలయంలో..



మెదక్ మున్సిపాలిటీ: యజ్ఞం చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): వసంత పంచమి సందర్భంగా గురువారం చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న సత్యనారాయణ స్వామి మండపంలో కొలువైన సరస్వతీదేవికి భక్తులు ప్రత్యేక పూజలు, అష్టోత్తర నామాలతో కుంకుమార్చన నిర్వహించారు. విగ్రహ దాత సత్తయ్య గుప్తా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, అర్చకుడు ప్రభుశర్మ తదితరులు ఉన్నారు. శివ్వంపేటలోని బగలాముఖీ బాలాలయంలో వేద పండితుడు శాస్తుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో బంగారమ్మ దేవాలయంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తూప్రాన్ ఆర్డీఓ శ్యాం ప్రకాష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు అమ్మవారికి ఓడిబియ్యం, వస్త్రాలను చెల్లించి తమ మొక్కులను చెల్లించుకున్నారు

చదువుల తల్లి ఒడిలో అక్షరభ్యాసం

మెదక్ రూరల్: వసంత పంచమిని పురస్కరించుకొని గురువారం ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. మండల పరిధిలోని పేరూరు శివారులో గరుడ గంగా మంజీరా తీరాన కొలువుదీరిన సరస్వతీ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రాజమౌళిశర్మ, గుణాకర్, మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో చిన్నారులకు వారి తల్లిదండ్రులు అక్షరభ్యాసం చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మెదక్ మున్సిపాలిటీ: వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని శ్రీమాతా బోరంచమ్మ ఆలయంలో గురువారం సరస్వతీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. సరస్వతీ అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకొని వేద బ్రాహ్మణులు, వేద మంత్రాలు పఠిస్తుండగా అమ్మవారిని పుష్పాలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, పంచామృత విశేష అభిషేకం, గణపతి పూజ అనంతరం మహా సరస్వతీ, గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమం మాత బోరంచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జంగిటి పరమేశ్వర్, ఈరంటి సత్యనారాయణ గుప్తా, మెంగని నారాయణ ఆధ్వర్యంలో జరిగాయి.

వార్షికోత్సవానికి మహంకాళీ ఆలయం ముస్తాబు

- నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



ముస్తాబైన ఆలయం

దుబ్బాకటౌన్: కోరిన భక్తులకు కోరినన్ని వరాలిచ్చే మహిమగల దేవతగా దుబ్బాక పట్టణంలో కొలువైన మహంకాళమ్మ ప్రసిద్ధి. పట్టణంలోని చీకోడ్ వెళ్లే బైపాస్ రోడ్డులో గత 6 ఏళ్ల క్రితం మహంకాళి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారు. గ్రామ దేవతగా కొలుచుకుంటున్న మహంకాళీ ఆలయంలో షష్టమ వార్షికోత్సవానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని రెడ్డి సంఘాలు, మున్నూరుకాపు సంఘంతో పాటు ఇతర భక్తులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 27 ఉదయం 7 గంటలకు ఆలయంలో మహంకాళమ్మకు మహాభిషేకం శాకములతో అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ముందుగా గణపతిపూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ, ఉదయం 10 గంటల నుంచి సువాసినిలతో సామూహిక కుంకుమార్చన, అమ్మవారి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, అన్న దానం కార్యక్రమాలు ఉంటాయి. వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మల ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ జరుగుతుంది. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు లతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.